# 'విరూపాక్ష'లో పేలిన బాయిలర్

**ఇద్దరు మేనేజర్లు, మరో ఇద్దరు సిబ్బందికి గాయాలు**

పటాన్‌చెరు, జూలై 27: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని విరూపాక్ష పరిశ్రమలో శనివారం బాయిలర్ పేలడంతో ఇద్దరు మేనేజర్లు తీవ్రంగా, మరో ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయి. బీడీఎల్ భానూర్ సీఐ స్వామిగౌడ్, స్థానికుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో ఫార్మా ఉత్పత్తుల కంపెనీ విరూపాక్షలో మధ్యాహ్నం బాయిలర్ వద్ద చార్‌కోల్ యాష్ మరమ్మతుల కోసం సిబ్బంది వెళ్లారు. అప్పుడే అకస్మాత్తుగా బాయిలర్ పేలడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న మేనేజర్లు అనంత్‌రెడ్డి, శ్రీకాంత్, సిబ్బంది హరిప్రసాద్, దీపక్ గాయపడ్డారు. వీరిలో ఇద్దరు మేనేజర్ల అనంత్‌రెడ్డి, శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. వీరిని హుటాహుటిన పటాన్‌చెరులోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. పేలుడుతో ఆ బ్లాక్ రేకులు ఎగిరిపోయాయి. పాశమైలారం, పటాన్‌చెరు నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చి మంటలను ఆర్పాయి. ప్రమాదంలో నలుగురు సిబ్బందికి గాయాలయ్యాయని, వారికి యాజమాన్యం మెరుగైన చికిత్సను అందిస్తున్నదని పరిశ్రమ జీఎం రాజమౌళి తెలిపారు.

## టీటీడీ అదనపు ఈవోగా వెంకయ్య చౌదరి

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అదనపు ఈవోగా సీహెచ్ వెంకయ్య చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ అవకాశం కల్పించిన చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

## జీహెచ్‌ఎంసీ కార్మికురాలిపై వీధికుక్క దాడి

నేరేడ్‌మెట్, జూలై 27: రాష్ట్రంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. పలు ప్రాంతాల్లో స్వైరవిహారం చేస్తూ జనాలను తీవ్రంగా గాయపరుస్తున్నాయి. శుక్రవారం ఉదయం మల్కాజిగిరి డివిజన్ కృపా కాంప్లెక్స్ సమీపంలో జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికురాలు కమలమ్మపై వీధి కుక్క దాడి చేసింది. ఇంతలో ఓ ద్విచక్రవాహనదారుడు అక్కడికి రావడంతో కుక్క పారిపోయింది. కానీ, అప్పటికే కమలమ్మ రెండు కాళ్లపై కొరికి తీవ్రంగా గాయపర్చింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం నారాయణగూడలోని దవాఖానకు తరలించారు. ఈ దృశ్యాలన్నీ సమీపంలోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఆ వీడియోను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. వీధి శునకాలను ఎవరూ చేరదీయవద్దని, ఇండ్ల ముందు వాటికి అన్నం పెట్టవద్దని కోరారు.

# గంజాయి హాట్‌స్పాట్‌గా ధూల్‌పేట

- **15 మంది కింగ్‌పిన్‌లతోపాటు 42 మంది విక్రయదారుల గుర్తింపు**
- **తాజాగా 54 కిలోల గంజాయి స్వాధీనం**
- **ఆగస్టు 31 నాటికి 'ఆపరేషన్ ధూల్‌పేట' పూర్తి**
- **ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి వెల్లడి**



హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని, వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తున్నామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. గంజాయి, డ్రగ్స్ కింగ్‌పిన్‌లపై దృష్టిసారించామని, ఇప్పటివరకు ఒక్క ధూల్‌పేటలోనే 15మంది గంజాయి కింగ్‌పిన్‌లను, 42మంది విక్రయదారులను గుర్తించినట్టు చెప్పారు. శనివారం అబ్కారీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు అంశాలను వెల్లడించారు. గంజాయికి హాట్‌స్పాట్‌గా ఉన్న ధూల్‌పేటను ఆగస్టు 31 నాటికి గంజాయి రహిత ప్రాంతంగా మార్చుతామని స్పష్టంచేశారు. 'ఆపరేషన్ ధూల్‌పేట'లో భాగంగా ఇప్పటికే ఆ ప్రాంతాన్ని జల్లెడపడుతున్నామని, ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని వివరించారు. డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు టీజీన్యాబ్, టాస్క్‌ఫోర్స్, ఎస్వోటీ, పోలీసుల సహకారంతో ఎక్సైజ్ సిబ్బంది విస్తృతంగా దాడులు చేపడుతున్నట్టు తెలిపారు. శనివారం ధూల్‌పేటలో రాహుల్ సింగ్ అలియాస్ సమన్‌సింగ్ అనే వ్యక్తితోపాటు మరి కొందరి నుంచి 54 కిలోల గంజాయి పట్టుకున్నామని, మరోచోట నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, పటికను స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు స్వాధీనం చేసుకున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిల్వ కేంద్రాలపై ఆరా తీస్తున్నామని చెప్పారు. వాటి సమాచారం ఎవరికైనా తెలిస్తే తమకు అందజేయాలని కోరారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఖురేషీ, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పెరిగిన 'పోక్సో' శిక్షల రేటు

**ఈ ఏడాది 12 కేసుల్లో దోషులకు శిక్షలు**

**ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖాగోయెల్ వెల్లడి**

హైదరాబాద్, జూలై 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పోక్సో కేసులకు సంబంధించిన శిక్షలు పెరుగుతున్నట్టు తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖాగోయెల్ తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే 12 కేసుల్లో దోషులకు కఠిన కారాగార శిక్ష పడినట్టు చెప్పారు. రెండేండ్లలో నమోదైన 42 పోక్సో కేసుల్లో విచారణ, శిక్షల రేటు మెరుగైన స్థితిలో ఉన్నదని వివరించారు. ఈ ఏడాది ఇద్దరికి జీవిత ఖైదు, ఒకరికి 25 ఏండ్లు, ఐదుగురికి 20 ఏండ్లు, మరొకరికి ఐదేండ్ల జైలు శిక్ష విధించడంతోపాటు ముగ్గురికి ఏడాదిపాటు సామాజిక సేవ చేసే శిక్ష విధించినట్టు తెలిపారు. పోక్సో కేసుల్లో దోషులకు కఠిన శిక్షలు పడేలా చూస్తున్న దర్యాప్తు అధికారులు, పీపీలు, డాక్టర్లు, కౌన్సెలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఆమె అభినందించారు.

















